www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
చిత్తూరు



వేతన కష్టాలు.. తీరేదెన్నడు..

కోటి విద్యలు కూటి కొరకే.. కష్టాలు ఇబ్బందులు అవస్థలు అన్నీ జానెడు పొట్ట నింపుకోవడానికే... ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అగ్నిసెగలో.. అష్టకష్టాలు పడేది తమ కుటుంబాన్ని పోషించుకోవడానికే.. మరోవైపు తమ పిల్లలాంటి పిల్లలకు భోజనం వండి పెట్టడం కాసింత ఆనందాన్ని కలిగిస్తుందని, కష్టమైనా ఇష్టంగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరికి నాలుగు నెలలుగా వేతనాలు అందుక అవస్థలు పడుతున్నారు.

- నాలుగు నెలలుగా అందని బకాయిలు
- మధ్యాహ్న భోజన పథక కార్మికులు, ఆయాల అవస్థలు


విద్యార్థులకు భోజనం తయారు చేస్తున్న ఆయమ్మలు

ప్రజాశక్తి- పూతలపట్టు: పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు మధ్యాహ్నం భోజనపథకం కార్మికులు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిగో బడ్జెట్.. ఇదిగో ఖాతాలకు జమా అంటూ అధికారులు చెప్పడమే కానీ నిధులు మాత్రం విడుదల కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మధ్యాహ్న భోజనానికి అవసరమైన సరుకుల కొనుగోలు విషయంలోనూ బిల్లులు అందడం లేదని.. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాన్ని ఎలా నెట్టుకొస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. పూతలపట్టు మండలంలో మొత్తం 67 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉండగా 92 మంది కార్మికులు ప్రస్తుతం పని చేస్తున్నారు.

ఇలాగైతే కుటుంబ పోషణ భారమే..

గడిచిన ఆరు నెలలకు రెండు నెలలకు మాత్రమే వేతనాలు మంజూరయ్యాయి. మిగిలిన నాలుగు నెలలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్ నెల కూడా ప్రారంభమయ్యింది. విద్యార్థుల సంఖ్యను బట్టి 300 మంది లోపు విద్యార్థులుంటే ఒకరు 300 నుంచి 600 మంది లోపు ఉంటే ముగ్గురు ఆపై ఉంటే నలుగురు ఇలా విద్యార్థుల సంఖ్యను బట్టి తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో అధికారులను ఆయాల నియామకం చేపట్టారు. ఒక ఆయాకు నెలకు 6000 వేతనం చొప్పున ఏడాదిలో పదివేల వేతనం అందించే వేసవి సెలవుల రెండు నెలల్లో సగం వేతనం ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఆయాలుగా అధికంగా ఉండడం పేద కుటుంబాలు కావడంతో కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సకాలంలో వేతనాలు జమ చేస్తుందని వారు ఎదురు చూస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులదీ.. అదే పరిస్థితి.. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో గౌరవ వేతనాలతో పాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించిన బిల్లులు విడుదల కాలేదు. ఈ సమస్యలపై ఇటీవల సిఐటియు నాయకులు ఉన్నతాధికారులు వినతిపత్రాలు కూడా అందించారు అయినా స్పందన శూన్యం.

ప్రభుత్వ స్పందించాలి..



పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 900 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం నలుగురు పనిచేస్తున్నాం. సరుకుల కోసం నెలకు రూ.30వేల నుంచి 35వేల వరకు ఖర్చవుతుంది. నాలుగు నెలలుగా ఈ వేతనాలు కూడా అందకపోవడంతో నిర్వహణ భారంగా మారుతుంది. దుకాణాల్లో అప్పులు కూడా ఇవ్వడం లేదు. మధ్యాహ్నం భోజనం నిర్వహణ చాలా ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించాలి.

- షాహీ నాథ్ మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

చాలా ఇబ్బందులకు గురవుతున్నాం..



ఇటు మాకు అందాల్సిన వేతనాలు అందక.. అటు నిర్వాహణకు అవసరమైన కూరగాయలు ఇతర సరుకులకు అవసరమైన వేతనాలు అందక ఇటు కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. సమస్యను పదేపదే అధికారులకు వివరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

- షాకీరా, మధ్యాహ్నం భోజనం నిర్వాహకురాలు

దళవాయి చెరువు కట్టకు గండి

- వృధాగా పోతున్న చెరువు నీరు
- పాదలకుంటపల్లి- నంజంపేట మధ్య రాకపోకలు బంద్.
- పరిశీలించిన ఎంపీడీవో, ఎస్సై, సర్పంచ్, ఎంపీటీసీ
- పూడ్చేందుకు విఫలయత్నం


గండిపడ్డ దళవాయి చెరువు వద్ద గ్రామస్తులు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం పొదలకుంటపల్లి పంచాయతీలోని దలవాయి చెరువుకు బుధవారం మధ్యాహ్నం తూము వద్ద గండిపడి నీరుకట్ట క్రింద పోతుండడాన్ని స్థానికులు గుర్తించారు. పొదలకుంటపల్లి, తుగడంవారిపల్లి, ఎం.వడ్డిపల్లి గ్రామాలకు చెందిన మొత్తం గ్రామస్తులంతా చెరువుకట్ట కింద గండిపడి నీరు వృధాగా పోతున్న ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అయితే సన్నగా లీకేజీలో పోతున్న నీరు కాస్త చెరువు కట్టను కోసుకుంటూ రానురాను గండి పెద్దదిగా మారడంతో రాకపోకలను కట్టమీద నిలిపివేశారు. ఎంపీటీసీ నాగభూషణ రెడ్డి, సర్పంచ్ జయరాం, ఎంపీడీఓ నారాయణ, ఎస్ఐ శివశంకర్ గండి పూడిన స్థలాన్ని పరిశీలించి జెసిబి ద్వారా ఇసుక మూటలను మట్టిని తోలి గండిని పూడ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నిండుగా నీరు ఉండడం దళవాయి చెరువుకు ఎగువన ఉన్న సోమప్ప చెరువు నుండి కూడా మొరవ నీరు అధికంగా వస్తూ ఉండడంతో నీటిని నిలువరించడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. సాయంత్రం ఐదు గంటలకు చెరువు కట్ట కింద నుండి గండి పడ్డ ప్రాంతంలో మొత్తం చెరువు కట్ట పూర్తిగా నీటితో కొట్టుకుపోయి చెరువు కట్ట రెండుగా విడిపోయింది. దీంతో అప్పటికే చీకటి పడటంతో చేసేది ఏమీ లేక దిగువ ప్రాంతాల ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తూ సమీప ప్రాంత రైతులకు హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు సంఘటన స్థలంలోని పరిస్థితిని సమీక్షిస్తూ ఉన్నారు.

2011 నవంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు దలవాయి చెరువుల వద్ద 2 మొరవలు పూర్తిగా కొట్టుకుపోవడంతో అప్పటి ప్రభుత్వం ఎంపీటీసీ సర్పంచ్ మాజీ మంత్రి రామచంద్రారెడ్డి వద్ద సమస్యను తీసుకువెళ్లి కోటి 50 లక్షల రూపాయలతో యుద్ధ ప్రాతిపదికన కొట్టుకుపోయిన రెండు మొరవలను పూర్తిస్థాయిలో నిర్మించి రాకపోకలు కొనసాగేలా చేశారు. ఇప్పుడు మళ్లీ చెరువు కట్ట కింద తూము వద్ద ఏర్పడిన గండి చెరువు కట్ట బలాబలాలను అనుమానానికి గురిచేస్తుంది.

పాఠశాల విద్యార్థులకు కష్టం

దలవాయి చెరువు కట్టకు గండిపడడంతో పొదలకుంటపల్లి, ఎం.వడ్డిపల్లి, తుగడంవారిపల్లె నుంచి నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 8,9, పదవ తరగతికి దాదాపు 50మంది విద్యార్థులు ప్రతిరోజు వస్తారని ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ తెలిపారు. గండిపడ్డ ప్రాంతం నుండి రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు వారి స్వగ్రామాల నుండి దాదాపు 15 కిలోమీటర్లు చుట్టు తిరిగి సూరయ్యగారిపల్లి, సోమల నుండి నంజంపేట పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం గండిపడ్డ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి మధ్యాహ్నం రెండు గంటలకే ఉన్నత పాఠశాల నుండి తమ పిల్లలను ఇండ్లకు తీసుకువెళ్లిపోయారు. ఇరిగేషన్ అధికారులు చెరువుకట్టల నాణ్యతను పరిశీలించి మిగిలిన చెరువుల కట్టల దృఢత్వాన్ని తనిఖీ చేసి ఎలాంటి గండ్లు, మొరవలు కొట్టుకుపోవడం జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో నారాయణ, సర్పంచ్, ఎంపీటీసీ, ఎస్సై

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

భూ వివాదాలను తగ్గించేలా భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని సిసిఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సచివాలయం నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాదరి, డిఆర్ఓ మోహన్ కుమార్, తహశీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలకు ముగింపు పలికేలా రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఉండాలని తెలిపారు. అక్కడికక్కడే పరిష్కరించే సమస్యల పై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి, శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులందరూ రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో 782 రెవెన్యూ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని, ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా అందిన భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతున్నదన్నారు. పిజిఆర్ఎస్‌లో మ్యుటేషన్, దారి సమస్యలు, రీసర్వే ద్వారా ఉత్పన్నమైన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులకు కార్యక్రమ నిర్వహణపై సమాచారం అందించడం జరిగిందన్నారు. గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, సదస్సుల ద్వారా అందిన పిటీషన్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములను సర్వే చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఫ్రీ హోల్డ్ రిజిస్టర్డ్ భూములకు సంబంధించిన


సమావేశంలో తహశీల్దార్లతో మాట్లాడుతున్న జెసి విద్యాధరి

పూర్తి సమాచారాన్ని తహశీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్లతో జిల్లా జాయింట్ కలెక్టర్ రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ కింద ఉండగా ఇందులో 2,561 ఎకరాలు ఫ్రీ హోల్డ్‌లో రిజిష్టర్ కాబడినదని, ఇందులో 1,344 ఎకరాలు డీవియేషన్ కాబడినదని, 1217 ఎకరాలు చట్టప్రకారం కలదని తెలిపారు. ఫ్రీ హోల్డ్ రిజిస్టర్డ్ భూములకు సంబంధించి మండలాల వారీగా ప్రతి తహశీల్దార్‌కు అందిన సమాచారం మేరకు మరొకమారు సర్వే నెంబర్, విస్తీర్ణం, హక్కుదారుని పేరు సంబంధిత వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించిన అనంతరం సంబంధిత వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని తహశీల్దార్లు ఈ అంశానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలన్నారు.

డిఆర్‌డిఏ పీడీగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

డిఆర్‌డిఏ పీడీగా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని డిఆర్‌డిఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న శ్రీదేవికి డిఆర్‌డిఏ పీడీగా బాధ్యతలు స్వీకరించారు.



ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు తప్పించాలి

11న డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించాలని కోరుతూ ఈనెల 11వ తేదీ డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నదన్నారు. అసంబద్ధ నిర్ణయాలైన అపార్ కార్డుల నమోదు, నిరంతరం ఏదో ఒక బోధనేతర కార్యక్రమం పేరుతో విలువైన బోధన సమయాన్ని వృథా చేస్తున్నారని, పది శాతం ఉపాధ్యాయులకు మాత్రమే సెలవు మంజూరు, పండుగ రోజుల సైతం కూడా పదవ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం అసంబద్ధ యాక్షన్ ప్లాన్ రూపొందించడం వంటి వాటికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారికి నిరసన పత్రాన్ని అందించినట్లు తెలిపారు. అలాగే 11వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, జిల్లా సహధ్యక్షులు కె.రెడ్డెప్ప నాయుడు, రెహానా బేగం, జిల్లా కార్యదర్శి ఎం.పార్థసారథి, రేవతి, సారథి, మాధవరెడ్డి, మధుసూధన రెడ్డి పాల్గొన్నారు.

విజయపురం: ఉపాధ్యాయులను వేధించడం తగదని యూటీఎఫ్ నాయకులు బుధవారం విజయపురంలో ఎంఈవో శ్యామలాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంబద్ధంగా నిర్ణయాలు తీసుకొని పనివేళలు పెంచడం, 10 శాతానికి మించి సెలవు పెట్టరాదంటూ ఆంక్షలు విధించడం, పదవ తరగతిలో సంసిద్ధత పేరుతో ఆదివారం, పండుగ దినాల్లో వందరోజుల యాక్షన్ప్లేన్ తయారు చేయడం, విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేయాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సెలవుపై నిబంధన విధించడం వలన కొందరు అధికారులు అనారోగ్యం భారినపడిన వారికి, అత్యవసరం ఉన్న వారికి సెలవు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మణిగండన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణా పాల్గొన్నారు.


విజయపురంలో..



బంగారుపాళ్యంలో..

బంగారుపాళ్యం: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత కోరారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని, ఈనిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు మహేష్ బాబు, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కోశాధికారి బాలాజీ, సభ్యులు బాలాజీ, అమ్ములు, విజయ్ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు పెద్ద తేడా లేకుండా విద్యాశాఖ అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారని యుటిఎఫ్ జిల్లా జిల్లా శాఖ కార్యదర్శి ఈశ్వర మహేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులిచెర్ల మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరినాథ రెడ్డప్ప, విజయ్ కుమార్, కళావతి, కరుణాకర్ రెడ్డి, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.


రొంపిచెర్లలో..

ఐరాల: విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు విద్యార్థులు తీవ్రఆందోళన గురికావాల్సి వస్తుందని యుటిఎఫ్ ఐరాల మండలశాఖ మండల విద్యాశాఖ అధికారిని కలిసి వినతి పత్రం అందించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు దేవరాజులు, కార్యదర్శి అరుణ కుమార్, నాయకులు ఏకాంబరం, గుణసుందరి జనార్ధన్, దేవి, మహదేవ పాల్గొన్నారు.


ఐరాలలో..

మా ఊళ్లో.. మద్యం షాపు వద్దు..

- రోడ్డుపై నిరసన తెలిపిన గ్రామస్తులు
- కుటుంబాలు వీధిన పడుతున్నాయంటున్న మహిళలు



ప్రజాశక్తి- వెదురుకుప్పం

మద్యం షాపులు తమ గ్రామంలో పెట్టొదని, వైన్ షాపుల వలన తమ కుటుంబాలు వీధినపడుతున్నాయని బుధవారం పెద్దపోటుచేను గ్రామంలోని మహిళలు గ్రామస్తులు రోడ్డుపై నిరసన తెలిపారు. మండలంలోని పెద్దపోటుచేను గ్రామంలో పచ్చికాపలం కార్వేటినగరం ఆర్ అండ్ బి రోడ్డుకి ఆనుకొని ఉన్న వంతెన పక్కన వైన్‌షాపు ఏర్పాటు చేశారని దీన్ని వెంటనే మార్పు చేయాలని ఎక్సైజ్ అధికారులు షాపు యజమానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో యజమాని షాపును పెద్దపోటుచేను గ్రామానికి వెళ్లే దారిలోని రైస్ మిల్ వద్ద పెట్టేందుకు జెసిబితో శుభ్రం చేయించి పనులు మొదలు పెట్టారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దు అని నిరసన తెలిపారు. గ్రామం సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే వచ్చిన ఆదాయం అంతా మద్యం తాగడానికే ఖర్చు చేస్తూ తమ కుటుంబాలను వీధుల్లో పడేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పొద్దున నుంచి సాయంత్రం వరకు మహిళలు, చిన్న పిల్లలు రోడ్డుపైకి వచ్చిపోతుంటారని అటువంటి ప్రదేశంలో మద్యం షాపులు ఏర్పాటు చేయడం వలన ఆకతాయిలు ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురిచేస్తున్నాయి.

గ్రామంలో తాగుబోతులు పెరిగిపోతారు..

- ధన కోటమ్మ, గ్రామస్తురాలు



మా గ్రామంలో దగ్గరలోనే మద్యం షాపులు ఏర్పాటు చేస్తే తాగుబోతులు పెరిగే అవకాశం ఉంది. పొద్దున నుంచి కష్టపడిన సొమ్మును వైన్‌షాపుల్లో పెట్టి ప్రమాదం ఉంది. ఇప్పటికే గ్రామంలో చాలా మంది మగవాళ్లు మద్యానికి బానిసలై మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక గ్రామానికి దగ్గరల్లోనే మద్యం షాపు పెడితే అలవాటు లేని వాళ్లు కూడా అలవాడు చేసుకునే ప్రమాదం ఉంది.

మహిళలకు ప్రమాదం

- హేమశేఖర్ రెడ్డి, గ్రామస్తుడు



గ్రామంలోని రోడ్డుకి మహిళలు, చిన్న పిల్లలు పాలు పోయడానికి, స్కూల్‌కి వెళ్లడానికి, టౌన్‌లో ఏదైనా పని ఉంటే వచ్చి వెళుంటారు. అలాంటిది రోడ్డు పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఆకతాయిలు పెరిగిపోతారు. రోడ్డుపక్కన తాగుతూ మహిళలకు ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. కనుక ఇక్కడ మద్యం షాపును ఏర్పాటు చేయడానికి మేము అంగీకరించం.

ముద్రరుణాల మంజూరులో

ఏపీకి ప్రాధాన్యత ఇవ్వాలి

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



ముద్ర రుణాల మంజూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇది రాష్ట్రం పురోభివృద్ధికి దోహదపడుతుందని లోకసభలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరిచిన ముద్రరుణాలకు సంబంధించి, నిధులను రాబట్టడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెనుకబాటుకు గురైందని ఎంపి అన్నారు. ఈసారి ముద్ర రుణాల మంజూరులో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యతనివ్వాలని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ పురోభివృద్ధికి దోహదపడాలని విన్నవించారు. ఢిల్లీ లోకసభలో ఎంపి మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు భేష్ అని కొనియాడారు. 1934 రిజర్వ్ బ్యాంక్ యాక్ట్, 1949 బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1970 కంపెనీల యాక్ట్‌ల వల్ల బ్యాంకింగ్ రంగంలో పారదర్శకతకు పెద్దపీట వేయడంతో పాటు, ఖాతాదారులకు భద్రత, సైబర్ క్రైమ్ తగ్గించేందుకు వీలవుతుందని అన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వం సరికొత్త సంస్కరణల ద్వారా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. అలాగే నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఈజిపి పథకాన్ని చిత్తూరు పార్లమెంటులో అమలుపరుస్తున్నామని, ఇందుకు కేంద్ర ఆర్థికశాఖ సహకరించాలని కోరారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఎదగాలి

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి- కుప్పం రూరల్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఎదగాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. బుధవారం కుప్పం మండలం టి.సదుమూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీతో పాటు ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 త్రో బాల్ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, జనసేన కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ బి.వి నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లను నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ సఫారీ కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నమస్తే' కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరంలో గుర్తింపు పొందిన సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్‌కు పీపీఈ కిట్లు (రక్షణ పరికరాలు) పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారు, వారి కుటుంబసభ్యుల సంక్షేమం కోసం సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన పీపీఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పగలు వెలుగుతున్న వీధి లైట్లు




ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కళికాపురంలో వీధిలైట్లు పగటిపూట మాత్రమే వెలుగుతున్నాయి. రాత్రైతే వీధుల్లో ఒక్క వీధి లైట్ కూడా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో చిమ్మచీకట్లో పిల్లలు, మహిళలు పెద్దలు సైతం బయటకు రావాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం విషసర్పాలు సంచరిస్తున్న పరిస్థితి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిల్లో టార్చ్ లైట్లు ఉంటే తప్ప బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. వీధి లైట్లు మరమ్మతులు చేయించి పగలు కాకుండా రాత్రిల్లో వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

9,10 తేదీల్లో 'నాక్' పర్యటన

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ప్రభుత్వ సుబ్బారాం డిగ్రీ కళాశాలలో జరుగనున్న నాక్ పర్యటనను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. కళాశాల ఆవరణలో పూర్వవిద్యార్థులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనెల 9,10 తేదీలలో నాక్ పర్యటన శుభారం డిగ్రీ కళాశాలలో పర్యటించనున్నట్లు చెప్పారు. కళాశాల ఆవరణలో పూర్వవిద్యార్థులు చేపట్టినటువంటి కార్యక్రమాలను నాక్ దృష్టికి తీసుకెళ్తున్నారు. కళాశాల ఆవరణలోసైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయడం, క్యాంటీన్ ఏర్పాటు పూర్వవిద్యార్థుల చేపట్టడం జరిగిందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలన్ని నాక్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చేందుకు కలిసి కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు మాజీ ఏఎంసీ చైర్మన్ హరినాథ్‌రెడ్డి, త్యాగరాజ, విజయ శంకర్, నరేష్, సైలేంద్ర కుమార్, గిరిధర్, మనోహర్, ఎన్సీ సత్యనారాయణ గుప్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కే.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్డు



ప్రజాశక్తి- సదుం: ఫెంగల్ తుపాన్ తాకిడికి కురుస్తున్న వర్షాలకు మండల హెడ్ క్వార్టర్స్‌లోని నడిగడ్డ రోడ్డు బురదమయం... చిత్తడిగా తయారైంది. సదుం పోలీస్‌స్టేషన్ వద్ద నుండి ఎయం నడిగడ్డ నుండి చెరుకువారిపల్లి వరకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలు ఏర్పడి వర్షం నీళ్లు నిండి పోయింది. దీంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలు నడపాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని క్రాంతి ఆటో యూనియన్ సభ్యులు తెలిపారు. గుంత వలన పలుమార్లు ప్రమాదాలు కూడా సంభవించాయని ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

విద్యా బోధనపై టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి- ఐరాల: చిత్తూరు జిల్లా కలెక్టర్ రూపొందించిన బ్రైట్ లెవెల్ విద్యాబోధనపై ఐరాల మండలం గవర్నమెంట్ హైస్కూల్లో మండలంలోని ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. 3,4,5 తరగతుల విద్యార్థులు బాగా చదవడం, రాయడం, లెక్కల్లో చతుర్విధ ప్రక్రియ ద్వారా పిల్లల్లో సామర్థ్యం పెంచడం దీని ఉద్దేశ్యం అని ఎంఈఓ లు రుశేంద్రబాబు, దామోదర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు కోమల తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా జనార్ధన్, గణపతి, సుధాకర్ వ్యవహరించి టీచింగ్ ఆట్ ది రైట్ లెవెల్ ట్రైనింగ్ ద్వారా 3,4,5 తరగతులకు సులభపద్ధతిలో బోధించడం వారికి ఆ తరగతి సామర్థ్యాలు ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

రెడ్ క్రాస్ సంస్థ కృషిలో

యువత భాగస్వామ్యం కావాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రెడ్ క్రాస్ సంస్థ కృషిలో యువతీ యువకుల భాగస్వామ్యం అవశ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ జి.విద్యాధరి పేర్కొన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా జూనియర్, యువజన రెడ్‌క్రాస్ ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలతో పాటు, అత్యవసర వైద్యసేవలకు సహాయం చేసేలా యువతీ యువకులను చైతన్య పరచేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత, విపత్తు నిర్వహణ, రహదారి భద్రత వంటి అంశాలపై వ్యాసరచనాలు, ప్రసంగాలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యా సంస్థలలోని విద్యార్థులను రెడ్‌క్రాస్ సొసైటీలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యసిబ్బంది సహకారంతో వైద్య ఆరోగ్య శిబిరాలు, పరీక్షలు నిర్వహించాలని అన్నారు. చిన్న వయసులోనే యువతలో మానవతా విలువలు, సామాజిక సేవాతత్పరత పెంపొందించేలా, సమాజానికి అవసరమైన సమయంలో తక్షణ సేవలు అందించే క్రమశిక్షణ కలిగిన యువశక్తిని నిర్మించడం ప్రధాన ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతీ దేవి, డీఈఓ వరలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు, యువజన రెడ్‌క్రాస్ తరపున పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు ద్రోహం చేసిన కేంద్రం

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కడప స్టీల్‌ప్లాంట్ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి ప్రకటించడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కడపలో నిర్మించాల్సిన ఉక్కు పరిశ్రమపై కేంద్రమంత్రి ప్రకటన వెనుకబడిన రాయలసీమ ప్రజలను మోసం చేయడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ప్రభుత్వరంగంలోనే కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కడపలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయసీమ అభివృద్ధికి 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి 2018 ఫిబ్రవరి 22న కర్నూలులో ప్రకటించిందని, గత పది సంవత్సరాలుగా కడప ఉక్కుపరిశ్రమ నిర్మాణంపై హామీ ఇస్తూ వచ్చిన బిజెపి ఇలా మాటమార్చడం గర్హనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తన వైఖరి స్పష్టం చేయాలని, తెలుగుదేశం, జనసేన పార్టీ మద్ధతుతో కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ రాష్ట్రానికి మేలు చేయకపోగా తీరని ద్రోహం చేస్తున్నదని అన్నారు. ఇప్పటికే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తున్నదని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసించాలని, దాని సాధనకై ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఉద్యమించాలని కోరారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: యుక్త వయసు బాలికలు కచ్చితంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'హ్యాపీ యూట్రస్ హెల్తీ పీరియడ్స్' అంశంపై హెల్త్ స్టాఫ్‌కి అవగాహన సమావేశం నిర్వహించారు. ఫెమి సంస్థ నిర్వాహకురాలు అనంత మునిరాజు, జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థినులు నెలసరి సమయంలో పరిశుభ్రత పాటించడంతోపాటు నాణ్యమైన శానిటరీ నాప్కిన్స్ వాడాలని సూచించారు.

కాలువలు ఏర్పాటు చేయండయ్యా..

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కాళికాపురం గ్రామంలో మురుగునీటి కాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మురుగునీటి కాలువ లేకపోవడంతో స్థానిక ప్రజలు వాడే నీళ్ల, వర్షపు నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. నీరు నిల్వ చేరడంతో దోమలు, పురుగులు వృద్ధి చెంది అనారోగ్యం పాలవ్వడంతోపాటు దోమల వలన చిన్నపిల్లలకు సరైన నిద్ర లేకుండా పోతుందని ఇప్పటికైన అధికారులు మురుగనీటి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

కోసలనగరంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కోసలనగరంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసలనగరాన్ని పారిశ్రామికవాడగా మార్చడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా మనవరాలు కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, మాజీ జడ్పీటీసీ వసంతా సుధాకర్ రాజు, నర్సింహులు, హరికృష్ణా, సోమశేఖర్, ఓబులరాజు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

ప్రజాశక్తి- ఐరాల: ఈనెల 7వ తేదీ శనివారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారులు రుషేంద్ర బాబు, దామోదర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలోని 65 స్కూళ్లలో ప్రోగ్రస్ పండుగ జరుగుతుందన్నారు. 2,806 విద్యార్థులకు హెూలీ స్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందజేస్తామని, స్కూళ్లలో సరికొత్త ప్రయోగం తల్లిదండ్రుల ఎదుటే నివేదిక ప్రతి విద్యార్థికి అందిస్తామని, పిల్లలు ఏం చదువుతున్నారు, ఎలా చదువుతున్నారు, ఎన్ని మార్కులు వస్తున్నాయో! ఎన్ని రోజులు హాజరు అయినారు, ఇలాంటి సందేహాలు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు టీచర్లు తెలియజేస్తారని అన్నారు. హెూలీ స్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ పేరుతో విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. మండలంలో అన్ని పాఠశాలలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని, మండలంలోని 65 పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అకౌంట్లో 1,0,1700 రూపాయలు ప్రభుత్వం జమ చేసిందని, కావున ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు , ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు, దాతలు మెగా పేరెంట్స్ , టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్వారీ లైసెన్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- విజయపురం: నగరి మున్సిపల్ పరిధి కీళ్లపట్టు సర్వే నెంబర్ 49-1పిలో ఉన్న క్వారీ లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలంటూ కీళపట్టు గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కీళ్లపట్టులో అక్రమంగా క్వారీ నడుపుతున్నారని, దీని ద్వారా చుట్టు పక్కల వ్యవసాయ పొలాలపై దుమ్ము, దూళి పడడంతో పంటలు దిగుబడి తగ్గిపోయిందని, భూములు వ్యవసానికి పని రాకుండపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో క్వారీ నిలిపుదలపై నిరసనలు, ధర్నాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, అక్రమ క్వారీ నిలిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

దివ్యాంగులు ప్రపంచ మేధావులవుతారు: ఎంపీడీఓ


పుంగనూరులో..

ప్రజాశక్తి- పుంగనూరు: దివ్యాంగుల విద్యార్థులకు ఐక్యూ చాలా ఎక్కువగా ఉంటుందని వీరిని సరైన పద్ధతిలో సౌకర్యాలు అందించినట్లయితే ప్రపంచ మేధావులుగా ఎదుగుతారని ఎంపీడీవో లీలామాధవి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి కాని మనసుకు కాదని అన్నారు. దివ్యాంగులకు సరైన పద్ధతిలో సౌకర్యాలు అందించినట్లయితే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వీరి అలవెన్సులు, ఉపకరణాలు, ఫిజియోథెరపీ, క్యాంపులు నాణ్యమైన విద్యను భవిత ద్వారా అమలు చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల పిల్లలను ఇంటి దగ్గర పెట్టుకోకుండా భవిత కేంద్రాలకు పంపితే మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. అందరి పిల్లలతో పాటు సమానంగా దివ్యాంగుల పిల్లలు కూడా ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పి వెంకటరమణ, అరుణ, సీనియర్ న్యాయవాది వీర మోహన్‌రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులు కేవలం అంగవైకల్యం కలిగిన వారే కానీ వారికి ప్రోత్సాహాన్ని తోడ్పాటును అందిస్తే వారు కూడా సాధారణ మనుషుల లాగే వారిలోని ప్రతిభను సమాజానికి చూపెడతారని పలువురు వక్తలు అన్నారు. ఈనెల 3వ తేదీ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భవితా కేంద్రం వద్ద దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పోటీలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిన అందరు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని2 శివ రత్నమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, ఐఆర్టి రవీంద్ర, రియాజ్, సిఆర్‌సి హెచ్‌ఎం హరినాథ్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్ రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు యుగంధర్, నిర్మల, సుభాష్, స్థానిక బాలరాజు స్కూల్ ప్రధానోపాధ్యాయులు నసీబజాన్ పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లిలో..

రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు తహశీల్దార్లు అందరూ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మనసు పెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఓలు, తహశీల్దార్లతో ఈ నెల 6 నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఈనెల 6వ తేదీ నుండి 2025 జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ప్రాథమిక ఉద్దేశ్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ప్రతి గ్రామానికి సదస్సుల సందర్భంగా సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుండి ముందస్తు సమాచారంతో వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులలో స్వీకరించే ఫిర్యాదులన్నిటినీ సంబంధిత పోర్టల్ లోకి అప్‌లోడ్ చేయాలని, షెడ్యూల్ ప్రకారం, రెవెన్యూ సదస్సులు ప్రతి రోజు రెవెన్యూ గ్రామంలో నిర్దేశించిన ప్రదేశంలో నిర్వహించాలని, ఈ అంశంపై సంబంధిత గ్రామస్తులకు ముందస్తుగా సమాచారం అందివ్వాలన్నారు. ఈ సదస్సులకు ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారులకు సమాచారం అందివ్వాలని సూచించారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సంబంధిత గ్రామాల వీఆర్‌ఓ, మండల సర్వేయర్, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అవసరమైన చోట్ల అటవీ, దేవాదాయ శాఖ, వక్ఫ్ బోర్డు సిబ్బందితో కూడిన ఈ అధికారబృందాలు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారని తెలిపారు. రెవెన్యూ సదస్సులో అందే ప్రతి అర్జీకి రసీదు అందజేయాలని ఆదేశించారు. నోడల్ అధికారిగా ఉన్న జిల్లాస్థాయి అధికారులు, ఆర్‌డిఓలు రెవెన్యూ సదస్సుల నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో అందే సమస్యలను 45 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచేలా రెవెన్యూ సదస్సులను జిల్లాలో నిర్వహించాలని సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేయడం ద్వారా సమస్యలను పరిష్కరించడం సులభతరం అవుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు డిఆర్‌ఓ మోహన్ కుమార్, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డిఓలు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

6 నుంచి సదుం మండలంలో

మండల పరిధిలో ఈనెల 6 నుండి 28వ తేదీ వరకు ఆయా రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తున్నట్లు సదుం మండల తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. 6వ తేదీన 79ఏ చింతమాకులపల్లి, 7 నడిగడ్డ, 10 చెరుకువారిపల్లి, 11 అమ్మగారిపల్లి, 12 సదుం, 13 యర్రాతివారిపల్లి, 17 తాటిగుంటపాలెం, 18 తిమ్మానాయనపల్లి, 19 బూరగ మంద, 20 ఊటుపల్లి, 21 కంభంవారిపల్లి, 26 పాలమంద, 28 గొంగివారిపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సదస్సులో రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి అర్జీలు ఇవ్వాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రొంపిచర్ల మండలంలో..

ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ 2025 వరకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 6వ తేదీన బండకిందపల్లి, 10 పెద్దగొట్టిగల్లు, 16 బొమ్మయ్యగారిపల్లి, 19 చిచిలివారిపల్లి, 20 పెద్ద మల్లెల, 24 మోటమల్లెల, 26 గానుగచింత, 28 రొంపిచర్ల-1, 30 రొంపిచర్ల-2 పంచాయతీలలో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ఐరాలలో 17వ విడత సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- ఐరాల: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశానికి డ్రామా పీడీ రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ1.4.2024 నుంచి 31.3.1014 వరకు మండలంలో 28 గ్రామ పంచాయితీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరిగాయని తెలిపారు. ఈ పనులను 20.11.24 నుండి 3.12.24 వరకు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి గ్రామస్థాయిలో గ్రామసభలు ఏర్పాటు చేసి పంచాయతీలలో జరిగిన పనుల వివరాలను పనుల గురించి అవగాహన కల్పించడానికి గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా వచ్చిన అంశాల మీద బుధవారం బహిరంగ సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులోభాగంగా 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి, క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బందికి సుమారు రూ.43,000లు జరిమానాలు విధించినట్లు తెలిపారు. డీవీవో శివయ్య, ఎస్‌టిఎం లోకేష్, ఎంపీడీవో ధనలక్ష్మి, డీఈ ప్రసాద్, ఏపీవో సంధ్యారాణి, టీఏలు, ఎఫ్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపాధి హామీ పీడీ రవికుమార్

మొరవలు పారుతున్న చెరువులు

ప్రజాశక్తి - సదుం: తుపాన్ వలన సదుంలో కురిసిన భారీ వర్షాలకు కంభవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సింహగుండ్ల ప్రాజెక్టు నిండి మొరవ పారుతుంది. తిమ్మానాయనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వ్యాసప్ప చెరువు, చిక్కరాయసముద్రం,



బుడ్డారెడ్డి చెరువు, కొర్లగుంట ప్రాజెక్టు మొరవపోతున్నది. గార్గేయి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇది ఇలా ఉండగా మండల పరిధిలో ఏడు గ్రామాల పరిధిలోని సుమారు 60 ఎకరాలలో వరిపైరు నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీట మునిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ బుధవారం పరిశీలించి నష్ట పరిహారాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు సమాచారాలను పంపిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాదర్బార్‌తో సమస్యలు పరిష్కారం..!


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- శాంతిపురం: రానున్న ఐదు సంవత్సరాలలో కుప్పం నియోజకవర్గ తలరాతను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చనున్నారని తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పి.ఎస్ మునిరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. టిడిపి శాంతిపురం మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, జనసేన సమన్వయకర్త డాక్టర్ బివి.నరేష్ పాల్గొన్నారు.

రామకుప్పం: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రజా దర్బార్‌తో ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కారం అవుతాయని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడ్డూరు గ్రామంలో ప్రజాదర్బార్ గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల వినుతులను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, పెన్షన్లు, భూ సమస్యలు, మరుగుదొడ్లు, తాగునీరు సమస్య, గృహనిర్మాణాలపై చర్చించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, యూనిట్ ఇంచార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

11 లీటర్ల నాటుసారా స్వాధీనం

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కార్వేటినగరం, వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎన్ఫోర్స్మెంట్ సిఐ జవహర్ బాబు తెలిపారు. బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయంలో నిందితుడ్ని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చిత్తూరు డివిజన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు బొమ్మయ్యపల్లి గ్రామంలో మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించడంతో అదే గ్రామానికి చెందిన కే.చరణ్ రాజ్ ఇంటిలో అమ్మకానికి సిద్ధం చేసి ఉంచిన 11 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా నాటు సారా తయారీలు, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పృధ్వీరాజ్, హెడ్కానిస్టేబుల్ మునిసుందరం, సిబ్బంది దేవప్రసాద్, రాజేష్, డిల్లీబాబు, హేమాద్రి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం- వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పుంగనూరు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకాలు చేపడుతుండగా ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ నిర్వహించే దాడుల్లో పట్టుబడ్డట్లు సీఐ సురేష్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడులలో పుంగమ్మచెరువు కట్ట వద్ద తోపుమఠంకు చెందిన కే.నరసింహులు కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు 48 అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకాలు చేస్తుండగా దాడి చేసి పట్టుకుని అతని నుంచి టెట్రా ప్యాకెట్లు సీజ్ చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సుబ్రహ్మణ్యం గౌడ్, ఢిల్లీ, సురేంద్రబాబు, వినోద్ కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం మీదగా తమిళనాడు నుండి కర్ణాటక రాష్ట్రాలు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీఐ మల్లేష్ యాదవ్ స్వాధీన పరుచుకోవడం జరిగింది. సిఐకి ముందుగా అందిన సమాచారం మేరకు కుప్పం అర్బన్ పోలీసు సిబ్బందిని మండల పరిధిలోని చెక్కునత్తం పంచాయితీ కూసూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా సుమారు 1000 కిలోల రేషన్ బియ్యాన్ని, బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీన పరుచుకొని, మాదమ్మ, రాజప్ప, తీర్థగిరిలను నిందితులుగా భావించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గజేంద్ర యాదవ్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గజేంద్ర యాదవ్ మృతి తీరని లోటని చిత్తూరు జిల్లా యాదవ సంఘ అధ్యక్షురాలు కవిత సురేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్, జ్యోతి యాదవ్, హరీష్ యాదవ్ తెలిపారు. బుధవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని మోతరంగనపల్లికి చెందిన జి గజేంద్ర యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి రూ.61వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వంక నీరు మళ్లింపు

ప్రజాశక్తి - రొంపిచర్ల: తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి బండకిందపల్లి- పెద్దగొట్టిగల్లు బడబళ్ళ వంక ప్రాజెక్టులోని నీరు రోడ్డుపై ప్రవహించడంతో పరిసర గ్రామప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే రొంపిచర్ల మండలం తహసీల్దారు కిరణ్ కుమార్ తక్షణ చర్యలుగా జెసిబి ద్వారా నీటిని వంకవైపు మళ్ళించి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. ఆయన వెంట వీఆర్వో సురేంద్ర, వీఆర్ఏలు ఇర్ఫాన్ అలీ, లక్ష్మణ, దాము పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలో నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం ఓ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కుప్పం పట్టణపరిధిలో ఈనెల 11, 12 తేదీలలో ఆధార్ క్యాంపులను నిర్వహించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, కొత్తపేటలోని ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరమసముద్రం ప్రాంతంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని పీఈఎస్ వైద్యకళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చిత్రనాగరాజ్ తెలిపారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, పీఈఎస్ వైద్యకళాశాల సంయుక్తంగా కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాపించే విధానాలను విద్యార్థులకు వివరించారు. ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణే మార్గమని వివరించారు. ప్రతిఒక్క విద్యార్థి ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని, సమాజానికి అవగాహన కల్పిస్తూ ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, డైరెక్టర్ కోదండరామయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, కోఆర్డినేటర్ గంగాధరన్, పిఆర్‌ఓ ప్రవీణ్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.